నీటి శుద్ధిపై ఎన్జీఆర్ఐలో చర్చాగోష్ఠి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29(నమస్తే తెలంగాణ) : నీటిశుద్ధి, లవణీయతను తగ్గించడమే లక్ష్యంగా అనుసరించాల్సిన విధివిధానాలు, ఆధునిక పద్ధతులపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో కొరియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రీయల్ టెక్నాలజీ ప్లాంట్ రీసోర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.జూ డాంగ్ లీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్ పాల్గొని అభినందించారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 29 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలతో పాటు అన్ని బీఎస్సీ కోర్సుల రివాల్యుయేషన్ ఫలితాలను సైతం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

16న జాతీయ లోక్ అదాలత్

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 16వ తేదీకి మార్చుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలోని అన్ని కోర్టులకు వరుసగా 8నుంచి 10వరకు సెలవులు ప్రకటించడంతో 9వ తేదీన నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను 16వ తేదీకి మార్చినట్లు పేర్కొన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు చెందిన చైర్‌పర్సన్లు, న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శులు గమనించాలని ప్రకటనలో సూచించారు.

విధులను తేలిగ్గా తీసుకోవద్దు

శిక్షణ తరగతులకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసు జారీ చేస్తాం

- ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర క్రియాశీలకం
- వల్నరబుల్ మ్యాపింగ్‌ను తయారు చేయండి
- అధికారుల శిక్షణ కార్యక్రమంలో రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా గురువారం జూబ్లీహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి నిర్వర్తించవలసిన విధుల గురించి తెలియజేస్తూ రూపొందించిన హ్యాండ్ బుక్‌ను అందజేశారు. క్షేత్రస్థాయిలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో నెలకొన్న పరిస్థితులను ముందుగానే గమనిస్తూ, ఎప్పటికప్పుడు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు మ్యాపింగ్ తయారు చేయాలని కమిషనర్ తెలిపారు. విధులను ఎంతమాత్రం తేలికగా తీసుకోకూడదని, ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు నియమ నిబంధనలు మార్పు చేస్తుందని పేర్కొన్నారు. ఎవరైనా విధుల పట్ల అలసత్వాన్ని ప్రదర్శిస్తూ నిర్లక్ష్యానికి తావిస్తే, వారిపై చర్యలు తప్పవన్నారు. సెక్టోరల్ అధికారులు శిక్షణ తరగతులకు హాజరు కాని వారికి షోకాజ్ నోటీసు జారీ చేస్తామని అన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

సెక్టోరల్ అధికారులు పారదర్శకంగా, నిబంధనల మేరకు విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని కమిషనర్ చెప్పారు. తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో తాజా స్థితిగతులను పరిశీలించాలని, గత ఎన్నికల్లో చోటు చేసుకున్న సంఘటనలు, పూర్తి వివరాలు నివేదిక సమర్పించాలని సూచించారు. సెక్టోరల్ అధికారులకు ఎన్నికల సమయంలో ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలు ఇస్తామన్నారు. ప్రధానంగా ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకోకుండా నిలువరించే వారిని, అలాగే ఓటర్లను ప్రభావితం చేసే వారిపై నిఘా పెట్టి ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు, సెక్టోరల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయండి : పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికి సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం సెక్టోరల్ అధికారులకు ఈవీఎంల నిర్వహణపై అవగాహన కల్పించి, ఈవీఎంలపై హ్యాండ్స్ ఆన్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతుల్లో అడిషనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రె, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, జోనల్ కమిషనర్లు, ఏసీపీలు, సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



'కొంగు బంగారం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, రచయిత ప్రొఫెసర్ సూర్యాధనంజయ్

కొంగు బంగారం పుస్తకం ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 29 : ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ సూర్యాధనంజయ్ రచించిన 'కొంగు బంగారం' పుస్తకాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆవిష్కరించారు. గిరిజన కుంభమేళాగా పిలువబడే సమ్మక్క సారలమ్మ జాతర చరిత్ర, ప్రాశస్త్యం, ఆదివాసీ గిరిజన సంప్రదాయాలపై పరిశోధనా దృష్టితో ఈ పుస్తకాన్ని ప్రొఫెసర్ సూర్యాధనంజయ్ రచించారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ మాజీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ధనంజయ్‌నాయక్, డాక్టర్ రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

జన్యు సమస్యపై అవగాహన పెంచాలి

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్

సదస్సులో పాల్గొన్న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్

అమీర్‌పేట్, ఫిబ్రవరి 29 : జన్యు సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. గురువారం బేగంపేట్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనిటిక్స్‌లో జరిగిన అరుదైన వ్యాధుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అరుదైన వ్యాధుల నుంచి సంరక్షణ పేరుతో రూపొందించిన పోస్టర్‌ను ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనిటిక్స్ డైరెక్టర్ డాక్టర్ బి.విజయలక్ష్మి, ఓయూ డెవలప్‌మెంట్ అండ్ యూజీసీ అఫెయిర్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ మల్లేశం, నిమ్స్ న్యూరాలజీ విభాగాధిపతి ప్రొ.డాక్టర్ సూర్యప్రభ, సెంటర్ ఫర్ డీఎన్ఏ సైటోజెనిటిస్ట్ డాక్టర్ ఉషా దత్తా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనిటిక్స్ ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ బి.శ్రీనాథ్, ఉస్మానియా వైద్యులు డాక్టర్ ఎ.రవితేజ, నీలోఫర్ వైద్యులు నాదిర్ అమన్, రివైటీ హెల్త్‌కేర్ ఉత్పత్తుల విభాగం డైరెక్టర్ మయాంక్ శ్రీవాస్తవ, ఐజీహెచ్‌జీడీ క్లినికల్ జెనిటిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ టి.సునీతలతో కలిసి ఆవిష్కరించారు.

భూసేకరణ చేయండి.. పనుల్లో వేగం పెంచండి

స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన జీహెచ్ఎంసీ కమిషనర్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) /సైదాబాద్ : స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఆదేశించారు. గురువారం ఉన్నతాధికారులతో కలిసి నగరంలో పలు ప్రాంతాలలో పర్యటించారు. తొలుత అంబర్‌పేట ఫ్లై ఓవర్ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కోసం పెండింగ్‌లో ఉన్న ఆస్తుల సేకరణ వివరాలను సంబంధిత అధికారుల నుంచి కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, అప్రోచ్ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం కలిగించే అపార్ట్‌మెంట్స్ ముందు భాగాన్ని రోడ్డు వైపున స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలైన్‌మెంట్ ప్రకారం ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. క్యాదిరి బాగ్ వద్ద మసీదు పక్కనే ఉన్న చిన్న భాగాన్ని స్వాధీనం చేసుకోవాలని కమిషనర్ చెప్పారు. అంబర్‌పేట మహంకాళి ఆలయం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇతర చోటికి మార్చాలని, గాంధీ విగ్రహం ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డుకు అడ్డంగా ఉన్న చిన్న నిర్మాణాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి మలక్‌పేట్ నుంచి ఐఎస్ సదన్ వరకు ఫ్లై ఓవర్ పనుల పురోగతిని జోనల్ కమిషనర్ టి.వెంకన్నతో సమీక్షించారు. చంచల్‌గూడ ప్రెస్‌రోడ్, సైదాబాద్ ప్రాంతాన్ని సందర్శించి ఫ్లై ఓవర్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ దేవానంద్ తదితరులు పాల్గొన్నారు. సైదాబాద్ పురాతన హనుమాన్ దేవాలయం మీదుగా చేపట్టిన స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల ఆలైన్‌మెంట్ మార్చాలని బీజేపీ నాయకులు సహదేవ్‌యాదవ్, కొత్త కాపు రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వినయ్‌కిశోర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూ రిజిస్ట్రార్‌కు 'ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్' అవార్డు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 29 : ఉన్నత విద్య అభివృద్ధిలో అందిస్తున్న సేవలు, కృషిని గుర్తించి గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేశ్ నిగమ్‌కు ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డును అందజేశారు. గచ్చిబౌలిలోని షెరిటాన్ హోటల్‌లో గురువారం ఔట్ లుక్ బిజినెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్‌టెక్ సమ్మిట్ -2024లో ఆయనకు ఈ అవార్డును అందజేశారు.

శ్రీ చైతన్యలో టెడ్ ఎక్స్

టెక్ ఎక్స్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో శ్రీ చైతన్య ఫ్యూచర్ పాత్ వే స్కూల్ చీఫ్ అకాడమిక్ ఆఫీసర్ పుష్పవల్లి, అధ్యాపక బృందం

మాదాపూర్, ఫిబ్రవరి 29 : విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలకు కార్యరూపం దాల్చుతూ, భారతదేశం ఎదుర్కొంటున్న పలు సవాళ్లు, ప్రపంచ దేశాల్లో భారత్ పాత్రను తెలిపే అంశాలకు మియాపూర్ శ్రీ చైతన్య ఫ్యూచర్ పాత్ క్యాంపస్ వేదికైంది. శ్రీ చైతన్య ఫ్యూచర్ పాత్ క్యాంపస్ అకాడమిక్ డైరెక్టర్ సీమ ఆధ్వర్యంలో టెడ్ ఎక్స్ (టెక్నాలజీ ఎంటర్‌టైన్‌మెంట్ డిజైన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ అకాడమిక్ ఆఫీసర్ పుష్పవల్లి హాజరై ప్రసంగించారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. 6 నుంచి 8వ తరగతులకు చెందిన 500 మంది విద్యార్థుల్లో 12 మంది విద్యార్థులను టెడ్ ఎక్స్ కు ఎంపిక చేసినట్లు తెలిపారు.

3న బ్రాహ్మణ సంఘాల రాష్ట్రస్థాయి సదస్సు

మాట్లాడుతున్న జమలాపురం శ్రీనివాసరావు

అంబర్‌పేట, ఫిబ్రవరి 29 : మాజీ ప్రధాని పీవీ నరసింహరావుకు భారతరత్న ప్రకటించడాన్ని పురస్కరించుకొని ఈ నెల 3వ తేదీన రాష్ట్ర బ్రాహ్మణ సంఘాల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ జమలాపురం శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించే ఈ సదస్సుకు రాష్ట్ర శాసన సభ వ్యవహారాలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. శాసన మండలి సభ్యురాలు సురభి వాణీదేవి, ప్రభుత్వ సలహాదారులు హర్కార్ వేణుగోపాల్, వివిధ పార్టీల్లోని బ్రాహ్మణ ప్రముఖులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మేధావులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఎంజేపీఆర్‌సీలో సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 29 : ఉస్మానియా యూనివర్సిటీలోని మహాత్మా జ్యోతిబా పూలే రీసర్చ్ సెంటర్ (ఎంజేపీఆర్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 'మహాత్మా జ్యోతిబా పూలేస్ ఐడియాస్, థాట్స్ అండ్ కాంట్రిబ్యూషన్స్ టు ద సొసైటీ'పై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, వీసీ ప్రొఫెసర్ రవీందర్, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ హాజరుకానుండగా, కురుక్షేత్ర యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్‌కే చాహల్ కీలకోపన్యాసం వెలువరిస్తారని వివరించారు. సదస్సుకు విద్యార్థులు, పరిశోధకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హరిత లక్ష్యం 63లక్షలు

- ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి
- అధికారులను ఆదేశించిన మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : పర్యావరణ పరిరక్షణకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన హరిత హారం కార్యక్రమం విజయవంతమై సత్ఫలితాలు ఇచ్చింది. దానికి కొనసాగింపుగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ వచ్చే జూన్‌లో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించేలా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాలలోని శివారు మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో 63 లక్షల మొక్కలు నాటనున్నారు. దీనికి సంబంధించి డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు చేసే పనిలో నిమగ్నమయ్యారు. 13 శివారు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, జీహెచ్ఎంసీ వార్డులలో వివిధ రకాల మొక్కలు నాటనున్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, అర్బన్‌పార్కులు, పార్కులు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లాలోని 61 నర్సరీలలో మొక్కలు పెంచుతున్నారు. అవసరమైతే జీహెచ్ంఎసీతో పాటు, అటవీశాఖ మొక్కలను సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

హరితహారంతో పచ్చందాలు

హరితహారం కార్యక్రమం నిర్వహణతో పట్టణ, శివారు ప్రాంత మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలు పచ్చందాలతో ఆహ్లాదకరంగా మారాయి. పట్టణ, పల్లె పకృతి వనాలు ఏపుగా పెరిగి పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. పట్టణ, పల్లె పకృతి వనాలలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగేలా ప్రత్యేక దృష్టి సారించడంతో పట్టణ, పల్లె ప్రకృతి వనాలు నగరంతో పాటు పల్లెలకు అందాలను తెచ్చిపెట్టాయి. అంతేకాకుండా ప్రకృతి వనాలలో ప్రజలు వాకింగ్ చేసుకునేల వాకింగ్ ట్రాక్‌లు, కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు, పిల్లలు అడుకునేలా క్రీడా పరికరాలను ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యులను చేయడంతో హరితహారం కార్యక్రమం విజయవంతమైన విషయం విధితమే.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాచవాని సింగారంలోని పల్లె ప్రకృతి వనం

మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తిస్తున్న అధికారులు

గత సంవత్సరం 63లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించగా.. ఈ సారికూడా అదే 63 లక్షల మొక్కలు జిల్లాలో నాటాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించి ఉపాధి హామీ కూలీలచే గుంతలను తవ్వించనున్నారు. హరితహారం విజయవంతం చేసేలా జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు భాగస్వాములు కావాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు రాజధాని ఏసీ బస్సులు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 29 : హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్, జూబ్లీ బస్‌స్టేషన్, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ల నుంచి ఈ నెల 2వ తేదీ నుంచి శ్రీశైలంకు పది రాజధాని ఏసీ బస్సులను నడుపుతున్నట్లు టీఎస్ఆర్‌టీసీ రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దలకు రూ.650, పిల్లలకు రూ.510 చార్జీ ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నగరంలో నేడు..

- బేగంపేట్ నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్‌లోని బీపీఆర్ విఠల్ ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ ఫౌండేషన్ డే లెక్చర్.
- రవీంద్రభారతి సమావేశ మందిరంలో సాయంత్రం 5:30 గంటలకు విశ్వనాథ్ విశిష్ట నటనా పురస్కారాల ప్రదానం.
- రవీంద్రభారతిలో సాయంత్రం 6 గంటలకు దివాకర బాబు నాటకములు-నాటికలు పుస్తకావిష్కరణ.. భూతకాలం నాటక ప్రదర్శన.
- బేగంపేట్ హోటల్ మారిగోల్డ్‌లో సాయంత్రం 6:30 గంటలకు ఎండోమెత్రియోసిస్ ఇండియా 2.0.24 పబ్లిక్ అవేర్నెస్ ప్రోగ్రాం.

జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ వద్ద వై కే డిజైనర్స్ ప్రారంభం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 29 : ఆధునిక ఫ్యాషన్ ప్రపంచంలో అందరినీ ఆకట్టుకునే విధంగా వై కే డిజైనర్ ఫ్యాబ్రిక్ స్టూడియోను హైదర్‌నగర్ జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా యాంకర్ రవి మాట్లాడుతూ సరసమైన ధరల్లో అందరికీ నచ్చే దుస్తులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. రాకింగ్ రాకేశ్ మాట్లాడుతూ విభిన్న రకాల డిజైన్లకు నిలయంగా వై కే డిజైనర్ నిలుస్తుందన్నారు. డిజైనర్ల నైపుణ్యంతో వివిధ రకాల డిజైన్లను అందుబాటులోకి తెచ్చామని స్టూడియో ప్రతినిధులు యశ్వంత్, కౌశల్య తెలిపారు. ప్రత్యేకించి వివాహాది శుభ కార్యాలకు ఆకట్టుకునే కలెక్షన్స్‌తో మంచి డిమాండ్ ఉండనున్నట్లు తెలిపారు.

వాసవి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 29 : రక్తదానం ప్రాణదానంతో సమానమని వాసవి ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు అభిషేక్ చందా, సౌమ్య చందా పేర్కొన్నారు. వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో వివిధ హోదాల్లో పని చేసి పదవీ విరమణ పొందిన పలువురు ఉద్యోగులను సన్మానించారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్‌హాల్‌లో సీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ, ఓఎస్డీ వేణుగోపాల్, సీపీఆర్వో మహమ్మద్ ముర్తుజా, జాయింట్ కమిషనర్ జయంత్, లేబర్ ఆఫీసర్ విజయ భాస్కర్‌రెడ్డి పదవీ విమరణ పొందిన వారిలో శేరిలింగంపల్లి జోన్ ఆఫీస్ సబార్డినేట్ జి.రాములు, అంబర్‌పేట కామాటి తుల్జారామ్, గోషామహల్ కమాటి జగదాంబ, చార్మినార్ కామాటిలు శంకరయ్య, మణియమ్మ, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాయలంలో మజ్దూర్‌గా పనిచేసిన అబ్దుల్లా ఉన్నారు.